# రండి! సీట్ల మీద కూచోండి

గోపాల్: నా రాధకి ఎలా వుంది డాక్టర్ గారూ!

డాక్టర్ : మిస్టర్ గోపాల్! మీరొక్కసారి నాతో అలా పక్కకి రండి.

గోపాల్ : ఏం డాక్టర్! కొడతారా! నేనేం తప్పు చేశాను.

డాక్టర్ : అదికాదు. నీతో రహస్యంగా మాట్లాడాలి (ఇద్దరూ కారిడార్ లోకి నడుస్తారు)

డాక్టర్ : ఆమె పరిస్థితి చాలా సీరియస్‌గా వుంది.

గోపాల్ : ఆఁ!

డాక్టర్ : కంగారుపడకండి. ఆపరేషన్ చేస్తే ఏ ప్రమాదం లేదు.

గోపాల్ : ఆపరేషన్! అపరేషన్!! మరో గత్యంతరం లేదా డాక్టర్!

డాక్టర్ : లేదు. ఆమె ఈ లోకాన్ని విడిచి పెట్టేలోపుగా ఆపరేషన్ చెయ్యక తప్పదు.

గోపాల్ : ఎంతవుతుంది డాక్టర్?

డాక్టర్ : రెండు లక్షల రూపాయలు.

గోపాల్ : రెండు లక్షల రూపాయలే! ఎప్పటిలోగా కావాలి డాక్టర్?

డాక్టర్ : సాయంత్రం లోగా.

గోపాల్ : ఎలా డాక్టర్?

డాక్టర్ : వూళ్లో ఎడ్ల పందాలు జరుగుతున్నాయి. వాటిలో పాల్గొనండి. గెలిస్తే రెండు లక్షల రూపాయలు మీవే.

గోపాల్ : అలాగా! మరయితే ఎద్దు లేనివాళ్ళను పందెంలో పాల్గొనిస్తారా డాక్టర్?

డాక్టర్ : ఒక రెండెడ్ల బండిని మీరు వేగంగా తోలలి. దట్సాల్.

గోపాల్ : ట్రై చేస్తాను డాక్టర్.

డాక్టర్ : సిన్సియర్‌గా చెయ్యండి. గెలుపు మీదే.

గోపాల్ : ఇంతకీ నా రాధ జబ్బేవిటి డాక్టర్?

డాక్టర్ : అది ఒక విచిత్రమైన వ్యాధి. రేపు జరుగబోయేవన్నీ నిన్న జరిగాయను కొంటుంది. నిన్న జరిగినవన్నీ రేపు జరుగు తాయనుకొంటుంది.

గోపాల్ : ఈ వ్యాధి రాధకి ఎలా వచ్చింది డాక్టర్ ?

డాక్టర్ : దీని కంతకీ ఒక రకమైన సూక్ష్మజీవి కారణం. దురదృష్టవశాత్తూ అది మీ రాధలో ప్రవేశించింది.

గోపాల్ : ఎలా డాక్టర్?

డాక్టర్ : వెరీ సింపుల్! ముక్కుద్వారా శ్వాసకోశంలోకి ప్రవేశించి, అక్కడి నుంచి ఎకా ఎకీ ఎడమ అరికాలులోకి, మళ్ళీ అక్కడి నుంచి మెదడులోకి ప్రవేశించింది. ఆ సూక్ష్మజీవిది చాలా విచిత్రమైన మనస్తత్వం.

గోపాల్ : మీరు చాలా గొప్పవారు డాక్టర్! వ్యాధిని బలే కనిపెట్టారు.

డాక్టర్ : ఇదంతా నా గొప్పతనం కాదు. నిన్న ఆమె జడకి ఎక్స్‌రే తీస్తే బైట పడింది.

గోపాల్ : అలాగా డాక్టర్! అయితే సరే, నేను ఎడ్ల పందాలకు వెళ్ళివస్తాను.

డాక్టర్ : బెస్టాఫ్ లక్, నేనీలోగా అపరేషన్‌కు అన్నీ ఏర్పాట్లు చేస్తాను.

-- కట్ --

ఆపరేషన్ థియేటర్, పాతాళభైరవి మ్యూజిక్, ఎర్రదీపానికీ, గడియారానికీ క్లోజ్‌షాట్స్.

-- కట్ --

(కన్సల్టేషన్ రూమ్‌లో)

డాక్టర్ : ఆపరేషన్ సక్సెస్!

గోపాల్ : థ్యాంక్యూ డాక్టర్! ఇదుగో మీరడిగిన డబ్బు రెండు లక్షలు.

డాక్టర్ : వెరీగుడ్ (అందుకుంటూ) అయితే పందెం గెలిచారన్న మాట.

గోపాల్ : లేదు డాక్టర్! అది నా రాధ ఇన్సూరెన్స్ డబ్బు.●